www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 24 ఆగస్టు 2025
5
చిత్తూరు



ఎలక్షన్ 'చోర్' కమిషన్..

• మోడీ మౌనం వీడాలి • కాగడాల ర్యాలీతో నిరసన

ప్రజాశక్తి -పుంగనూరు: నేడు దేశంలో ఎన్నికల కమిషన్ అంటే 'ఎలక్షన్ చోర్ కమిషన్' అని, మోడీ ఓట్ల దొంగ కావడంతోనే సమాధానం చెప్పకుండా మౌనం వహిస్తున్నారని వెంటనే సమాధానం చెప్పాలని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఇందిరా సర్కిల్‌లో 'ఓట్ చోర్ గద్దె చోడ్' కార్యక్రమంలో భాగంగా ఇండియా బ్లాక్ ఆధ్వర్యంలో శనివారం కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల అర్హతను ధ్రువీకరించడానికి భారత ఎన్నికల సంఘం ప్రత్యేక ఇంటెన్సివ్ నిర్వహిస్తోందని దీన్ని వెంటనే రద్దు చేయాలని కోరారు. దొంగ ఓట్ల చేరికతో వ్యవస్థ భ్రష్టుపట్టిందని, దొడ్డిదారిలో బీజేపీ గెలుపు కోసం ఎన్నికల కమిషన్‌నే కలుషితం చేసిందని ఆరోపించారు. ఆర్‌ఎస్‌ఎస్, మతతత్వ పార్టీ బిజెపికి మద్దతుగా ఈ సి పనిచేయడం ఈ దేశ పరిస్థితి ఏమవుతుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యానికి కాపు కాయాల్సిన ఎన్నికల సంఘం మోడీ కి కాపు కాస్తోందని, ఎన్నికల కమిషన్ తీరు చూస్తే మేడిపండు చందంగా వుందన్నారు. స్వతంత్ర వ్యవస్థ కాస్త బీజేపీ చేతిలో కీలుబొమ్మగా మారిందన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ లాంటి అనుబంధ సంస్థల జాబితాలో ఈసీ కూడా భాగమైందని, నేడు దేశంలో ఎన్నికల కమిషన్ అంటే 'ఎలక్షన్ చోర్ కమిషన్' మోడీ ఓట్ల దొంగ కావడంతోనే ఈ మౌనం వహిస్తున్నారన్నారు. రాహుల్ గాంధీ బయటపెట్టిన నిప్పు లాంటి నిజాలపై సమాధానం చెప్పే దమ్ములేక డిక్లరేషన్ అంటూ వెనకుండి నాటకాలు ఆడిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పుంగనూరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి మురళీమోహన్ యాదవ్, పార్టీ పట్టణ అధ్యక్షులు అయూబ్ ఖాన్, నాయకులు ముబారక్, ఫయాజ్, అస్మత్, ఇమ్రాన్, మండల అధ్యక్షుడు మురళీమోహన్ పాల్గొన్నారు.



ఇండియా బ్లాక్ ఆధ్వర్యంలో నిరసన

సీఎం చంద్రబాబు కుప్పం పర్యటన ఖరారు



ప్రజాశక్తి-కుప్పం: సీఎం చంద్రబాబు నాయుడు కుప్పం పర్యటన ఖరారైంది. ఈనెల 29, 30వ తేదీల్లో సీఎం కుప్పం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. 29వ తేదీ సాయంత్రం సీఎం చంద్రబాబు దంపతులు కుప్పం చేరుకుంటారు. శాంతిపురం మండలం కడపల్లి వద్ద నూతనంగా నిర్మించిన సొంతింటిలో బస చేసి 30వ తేదీ ఉదయం సతీసమేతంగా సీఎం చంద్రబాబు కుప్పం మండలం పరమ సముద్రం సమీపంలో కృష్ణా జలాలకు జల హారతి ఇచ్చి హంద్రీ-నీవా జలాలను కుప్పంకు విడుదల చేయనున్నారు. అనంతరం అక్కడ నిర్వహించే బహిరంగ సభలో సీఎం పాల్గొనడంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నారు.

యూరియా విక్రయాలపై తనిఖీలు



ప్రజాశక్తి- వికోట: మండలంలో యూరియా విక్రయాలపై ఉన్నత స్థాయి అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. తిరుపతి రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌పి కరీముల్లా షరీఫ్ సూచనలు మేరకు శనివారం సాయంత్రం వి కోట లోని కెజి ఎఫ్ రోడ్ లో ఉన్న వినాయక ట్రేడర్స్, మురళీకృష్ణ ట్రేడర్స్‌లో ఎరువులు, యూరియాకి సంబంధించి తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో ఎలాంటి అసమానతలు లేవని, అన్ని సక్రమంగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో యూరియా కొరత ఉందన్నారు. ఈ కారణంగా రైతులకు యూరియా సక్రమంగా పంపిణీ జరుగుతోందా? లేదా అనే కోణంలో ఈ తనిఖీలు నిర్వహించామని తెలిపారు. విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ కె వెంకట రవి, మండల వ్యవసాయాధికారి అప్పోజి పాల్గొన్నారు.

వికోటకు కృష్ణా జలాలు

రైతుల హర్షం



ప్రజాశక్తి -వి కోట : హంద్రీ-నీవా కాలువ ద్వారా కృష్ణా జలాలు శనివారం ఉదయం వికోట మండలం చేరుకున్నాయి. పలమనేరు నియోజకవర్గంలోకి నీళ్ళు ప్రవేశించడంతో గ్రామ, గ్రామాలలో కృష్ణా జలాలకు స్థానిక ప్రజలు హారతులు పడుతూ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని కృష్ణాపురం పంచాయతీ మొట్లపల్లి వద్ద ఏర్పాటు చేసిన పంప్ హౌస్‌కు కృష్ణా జలాలు చేరుకున్నాయి. అక్కడ అధికారులు, కూటమి నాయకులు నదీ జలాలకు జల హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ మోటార్లను అధికారులు ఆన్ చేసి నీళ్లను మళ్లించారు. ఈ సందర్భంగా ఈఈ వెంకటేశ్వరరావు, చీఫ్ ఇంజనీర్ వరప్రసాద్ మాట్లాడుతూ జులై 17వ తేదీ ముఖ్యమంత్రి చంద్రబాబు నందికొట్కూరు హంద్రీ-నీవా ఫేస్-1 కార్యక్రమంలో రాయలసీమకు నీటిని విడుదల చేశారన్నారు. మల్లాల ఎత్తిపోతల ప్రాంతం నుండి కుప్పం బ్రాంచ్‌కు నీటి ప్రవాహం చేరేందుకు సుమారు 600 కిలో మీటర్లు నీరు ప్రవహిస్తుందన్నారు. సుమారు 110 చెరువులను నింపడం ద్వారా దాదాపు 6,300 ఎకరాలు విస్తీర్ణంలో భూమి సాగులోకి రానుందన్నారు. శనివారం పలమనేరు నియోజకవర్గం వి కోట మండలంలోకి హంద్రీ-నీవా జలాలు రావటంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులతో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో బోర్లు వేసినా ఫలితం లేక, గత కొన్ని సంవత్సరాలుగా వ్యవసాయానికి నీరు లేక అలమటిస్తున్నామన్నారు. తమ పొలాలు పక్కన జలాలు చూస్తుంటే చాలా ఆనందంగా ఉందన్నారు. చాలా మంది రైతులు నీరు లేక పట్టణాల బాట పట్టారని, కానీ ఇప్పుడు ఈ హంద్రీ-నీవా జలాలను చూస్తుంటే మళ్లీ పట్టణాల బాట పట్టిన రైతులు తిరిగి గ్రామాల బాట పట్టే అవకాశం వుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ఇబ్బత్తుర కార్యక్రమం చేపట్టిన ప్రభుత్వానికి రైతులందరూ ధన్యవాదాలు తెలిపారు. ఈనెల 30న కుప్పం నియోజకవర్గం, పాల సముద్రం వద్ద సీఎం చంద్రబాబు హంద్రీ-నీవా జలాలకు పూజలు చేయనున్న నేపథ్యంలో ప్రజలు చెరువులకు జలకళ కోసం నిరీక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రిత్విక్ కన్‌స్ట్రక్షన్ పీడీ నాగేశ్వరరావు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రామచంద్ర నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు రంగనాథ్, నేతలు రాంబాబు, వి కోట పిఏసిఎస్ ఛైర్మన్ నారాయణ స్వామి, చౌడప్ప, సోము, విశ్వనాథ్‌తో పాటు పెద్ద ఎత్తున నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డీఎస్‌సీ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ


లావణ్య

ప్రజాశక్తి- పెద్దపంజాణి: ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్‌సి ఫలితాలలో మండలంలోని శంకర్రాయలపేటకు చెందిన లావణ్య రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉత్తమ ర్యాంకు సాధించింది. గ్రామానికి చెందిన ఎం శంకరప్ప కుమార్తె లావణ్య బీసీ ఏ కేటగిరీలో జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 5 వ ర్యాంక్, టీజీటీ విభాగంలో రాష్ట్రంలో 6వ ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ఫలితాల పట్ల ఆనందం వెలిబుచ్చారు. డిఎస్సీ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన లావణ్యను తల్లిదండ్రులు, స్నేహితులు, బంధువులు, గ్రామస్తులు అభినందించారు.


సోమశేఖర్ గౌడ్

కార్వేటినగరం: కార్వేటినగరం పాత సంత వీధిలో నివసిస్తున్న శ్రీనివాసులు, శ్రీదేవి కుమారుడు సూరగని సోమశేఖర్ గౌడ్ 86 మార్కులతో ఎంపికయ్యారు. టిటిడి లో సెక్యూరిటీగా పనిచేస్తూ కుమారుడిని చదివించాడు. సోమశేఖర్ డీఎస్సీలో సత్తా చాటాడు. పోలీస్ కానిస్టేబుల్‌గా కూడా ఎంపిక కావడంతో వారి కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నిరుపేద కుటుంబంలో పుట్టి రెండు ఉద్యోగాలకు ఎంపిక కావడం అదృష్టమని చుట్టుపక్కల వారు సోమశేఖర్‌ను అభినందించారు. ముస్లిం కాలనీలో అన్నదమ్ములు మొహమ్మద్ రఫీ, సిద్దిక్ అద్భుతం ఎంపికయ్యారు. రాజా వీధిలో సతీష్ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడం పట్ల పలువురు అభినందించారు.


జి దేవరాజులు

యాదమరి: మెగా డిఎస్‌సి 2025 విడుదలైన ఫలితాల్లో ఓ సామాన్య రైతు కుటుంబం యాదమరి మండలం కోటి వారి పల్లి పంచాయతీ కే గొల్లపల్లి గ్రామానికి చెందిన జి దేవరాజులు మెగా డీఎస్సీ పరీక్షల్లో స్కూల్ అసిస్టెంట్ గణితంలో జి 81.19 మార్కులతో చిత్తూరు జిల్లాలో 10వ ర్యాంకు సాధించాడు. ఇతను ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు కే గొల్లపల్లి కసిరాళ్లలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించాడు. ఇంటర్మీడియట్ యాదమరి వరదరాజుల స్వామి జూనియర్ కళాశాలలో చదివాడు. డిగ్రీ విజ్ఞానసుధ డిగ్రీ కాలేజ్‌లో బిఈడి విసిఆర్ కాలేజ్‌లో చదివాడు. డీఎస్సీలో పదవ ర్యాంకు రావడంతో అతని కుటుంబ సభ్యులు కుమారి మురుగేష్ యాదవ్, శాంతమ్మ, తులసి మునయ్య పలువురు కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బాలుడి మృతిపై దర్యాప్తు

జిల్లా కార్మిక ఉప అధికారి ఆనందబాబు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: బాలుడు మృతిపై దర్యాప్తు చేపట్టామని జిల్లా కార్మిక ఉపాధికారి ఆనంద్ బాబు శనివారం పేర్కొన్నారు. మండలంలోని జయంతి వద్ద రెండు రోజుల క్రితం బీహార్ కు చెందిన బాలుడు విద్యుత్ షాక్ తో మృతి చెందడంపై సీఐ శ్రీనివాసులు ఇచ్చిన ఫిర్యాదు దర్యాప్తు చేపట్టామని తెలిపారు. మైనర్లను పనిలో పెట్టుకోరాదని కార్మిక చట్టం ప్రకారం మైనర్ల వద్ద పనులు చేయించరాదని చట్టాన్ని అతిక్రమిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ప్రసాద్, కార్మిక శాఖ సిబ్బంది పాల్గొన్నారు


దర్యాప్తు చేపట్టిన పోలీసులు, అధికారులు

వినాయక ఉత్సవాలు

ప్రశాంతంగా నిర్వహించాలి

రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం శ్రీనివాసులు

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్ : ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించుకోవాలని చిత్తూరు రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం శ్రీనివాసులు తెలిపారు. శనివారం రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో చిత్తూరు రెవెన్యూ డివిజనల్ అధికారి ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాల నిర్వహణపై పోలీస్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ డివిజనల్ అధికారి మాట్లాడుతూ పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతి భద్రతలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించుకోవాలని గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు. ఈ ఉత్సవాలను అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసే ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా సజావుగా జరిగేలా పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వినాయక విగ్రహాల నిమజ్జనం కట్టమంచి చెరువలో మాత్రమే చేయాలని , చెరువు వద్ద సరిపడా బారికేడ్లు, ఫోకస్ లైట్లు ఏర్పాటు చేయాలని, భక్తులకు తాగు నీరు సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పెద్ద క్రేన్లను ఏర్పాటు చేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలందరూ ఎంతో సంతోషముగా వినాయక చవితి జరుపుకోవాలని తెలిపారు. డిఎస్పీ మాట్లాడుతూ గత సంవత్సరం వినాయకుని ఉత్సవాలు ప్రశాంతంగా జరిగిందని, అలాగే ఈసారి కూడా ఏ చిన్న సంఘటన జరగకుండా ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. భద్రతా చర్యలు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో, గణేష్ ఉత్సవ్ కమిటీ సభ్యులతో చర్చించారు. ఈ సమావేశంలో వన్ టౌన్ సిఐ మహేశ్వర్, టూ టౌన్ సిఐ నెట్టి కంటయ్య, అడిషనల్ డీఎంఅండ్ హెచ్ ఓ వెంకట ప్రసాద్, అగ్నిమాపక శాఖ అధికారి కరుణాకరణ్, ఏపీఎస్ఆర్టీసీ అధికారి రూపశ్రీ, ఏపీ ఎస్పీడీసీఎల్ డిప్యూటీ ఈఈ ఏవి ఎస్ ఎస్ ప్రసాద్, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ లోకేష్, పోలీస్ అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడ్డ సుధీర్‌కుమార్

ప్రజాశక్తి-తవణంపల్లి: అప్పులు చెల్లించలేక ఓ వ్యక్తి తీవ్ర మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన మండలంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ చిరంజీవి కథనం మేరకు..తవణంపల్లి మండలం, అరగొండ పంచాయతీ అరగొండ గ్రామానికి చెందిన డి సుధీర్ కుమార్(31) తిరుపతిలో డ్రైవింగ్ పనిచేసుకొంటూ తన భార్య, పిల్లలతో అక్కడే ఉంటున్నారు. తిరుపతిలో ఎక్కువ అప్పులు చేశాడు. ఆ అప్పులు కట్టలేక మూడు నెలల క్రితం సుధీర్ కుమార్ తన కుటుంబంతో కలిసి అరగొండకి కాపురం వచ్చాడు. ఇక్కడికి వచ్చినప్పటి నుండి ఏమి పనిచేయకుండా ఖాళీగానే ఉంటున్నాడు. ఈ విషయమై సుధీర్ కుమార్, అతని భార్య గొడవ పడ్డారు. చేసిన అప్పులు ఎక్కువ చేసి వాటికి వడ్డీలు కట్టలేక, జీవనోపాధి లేక జీవితం మీద విరక్తి చెంది తీవ్ర మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి కళావతి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తవణంపల్లి పోలీసులు కేస దర్యాప్తు చేస్తున్నారు.

చరిత్రలో నిలిచిపోయే వ్యక్తి టంగుటూరి: ఎస్‌పి



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఆంధ్రప్రదేశ్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడిన మహనీయ స్వాతంత్ర్య సమర యోధుడు, ప్రజాసేవకుడు, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు అని ఎస్‌పి పేర్కొన్నారు. టంగుటూరి ప్రకాశం పంతుల జయంతిని చిత్తూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మణికంఠ చందోలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ 1872 ఆగస్టు 23న ప్రకాశం జిల్లా కనుపర్తిలో జన్మించిన టంగుటూరి ప్రకాశం భారత స్వాతంత్ర్య ఉద్యమంలో అపారమైన ధైర్యసాహసాలతో పేరు పొందారన్నారు. 1928లో సైమన్ కమిషన్ వ్యతిరేక ఆందోళన సమయంలో మద్రాసులో నిరసనకారులపై కాల్పులు జరపబోతున్న బ్రిటిష్ సైనికుల ఎదుట ఆయన తన ఛాతీని చూపించి "ఒకవేళ కాల్చాలనుకుంటే ముందుగా నన్నే కాల్చండి" అని సవాల్ విసిరారు. ఆ అజేయ ధైర్యమే ఆయనకు "ఆంధ్రకేసరి" అన్న గౌరవ బిరుదు తెచ్చిపెట్టిందన్నారు. టంగుటూరి ప్రకాశం స్వాతంత్ర్య సమర యోధుడే కాదు.. న్యాయం, నిజాయితీ, సమానత్వం కోసం నిలబడిన మహానాయకుడు. పోలీస్ శాఖగా మనం ప్రజల హక్కులను రక్షించే క్రమంలో ఆయన చూపిన ధైర్యం, సమర్పణ మనకు స్ఫూర్తి కావాలి' అని పేర్కొన్నారు. ప్రకాశం పంతులు 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటి ముఖ్యమంత్రిగా పనిచేశారని రైతుల సంక్షేమం, విద్యా అభివృద్ధి, పారిశ్రామిక రంగం వృద్ధి కోసం అనేక సంస్కరణలు చేపట్టారన్నారు. ఆయన జీవితం ప్రజల సేవకే అంకితం అయిందన్నారు. పోలీసులుగా మన కర్తవ్యం కేవలం చట్టాన్ని అమలు చేయడం మాత్రమే కాదు, న్యాయం, సమానత్వం, ప్రజల పట్ల కరుణతో కూడిన సేవ అందించడం టంగుటూరి ప్రకాశం జీవితం మనకు అదే బోధిస్తుందన్నారు.

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం: మేయర్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : వర్షాకాలంలో పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రతతోనే వ్యాధుల బారిన పడకుండా ఉండొచ్చని మేయర్ ఎస్ అముద పేర్కొన్నారు. 'స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర' లో భాగంగా శనివారం చిత్తూరు నగరపాలక పరిధిలో 'మాన్ సూన్ హైజిన్' అంశంపై ప్రత్యేక అవగాహన, ర్యాలీ, దోమల నియంత్రణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, ఇన్‌ఛార్జి కమిషనర్ వెంకటరామిరెడ్డి, సహాయ కమిషనర్ ఎ ప్రసాద్, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, ఎంహెచ్‌వో డాక్టరు పి లోకేష్ హాజరయ్యారు. లిటిల్ ఫ్లవర్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన అవగాహనలో మేయర్ మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో నగరంలో ఎక్కడా నీటి నిల్వలు లేకుండా ఎప్పటి కప్పుడు చర్యలు తీసుకుంటున్నామని.. ప్రజల పరిసరాలు పరిశుభ్రంగా వుంచుకోవాలన్నారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. చామంతిపురంలో అవగాహన ర్యాలీ, దోమల నియంత్రణ చర్యలు నిర్వహించారు. కర పత్రాలు పంపిణీ చేశారు. నగరపాలక పరిధిలోని అన్ని వార్డుల్లోనూ అవగాహన , ర్యాలీలో నిర్వహించి, దోమల నియంత్రణకు చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఇందు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డు కార్యదర్శులు, మేస్త్రీలు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న అడిషనల్ ఎస్‌పి ఆపరేషన్స్ ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు

చిత్తూరు అర్బన్: జిల్లా పోలీసు కార్యాలయం, పోలీస్ ట్రైనింగ్ సెంటర్, జిల్లాలో పోలీస్ స్టేషన్లలో 'క్లీన్ అండ్ గ్రీన్' నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కార్యాలయంలో అడిషనల్ ఎస్‌పి ఆపరేషన్స్, అడ్మిన్ ఇన్‌ఛార్జి ఎస్ఆర్ రాజశేఖరరాజు పాల్గొని మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో ఏఆర్ అడిషనల్ ఎస్పీ శివానంద కిషోర్, ఏఆర్ డిఎస్పీ చిన్ని కృష్ణ, మహబూబ్ బాష, ఆర్‌ఐ లు సుధాకర్, చంద్రశేఖర్‌తో కలిసి పరిసరాలను శుభ్రం చేసి మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేశారు.

షికారీ కాలనీలో మెడికల్ క్యాంపు

ప్రజాశక్తి - యాదమరి: యాదమరి మండల పరిధిలోని గువ్వల కాలనీలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం యాదమరి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనిల్ కుమార్ నాయక్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. షికారి కాలనీలో సుమారు 50 కుటుంబాలకు చికిత్సలు అందించారు. మండల అభివృద్ధి అధికారి వేణు ఆ కాలనీలో అభివృద్ధికి చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. యాదమరి తహశీల్దారు పార్థసారథి షికారి కాలనీలో నెలకొన్న సమస్యలు నూతన రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు ప్రతి ఒక్కరికి ఉన్నాయా? లేదా అని చెక్ చేసి లేని వారికి నూతన కార్డు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కమ్యూనిటీ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ శ్రీనివాస్ మూర్తి , సూపర్ వైజర్లు లక్ష్మీపతి, సెల్వ రాణి, ఎంఎల్‌పిహెచ్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, హెల్త్ అసిస్టెంట్ సురేంద్ర రెడ్డి పాల్గొన్నారు.


మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్న వైద్యులు, అధికారులు

వినాయక ఉత్సవాల్లో

నియమ నిబంధనలు అమలయ్యేనా?

ప్రజాదృష్టి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఏటా జిల్లాలో నిర్వహించే జాతరలు, వినాయక ఉత్సవాల సందర్భంగా పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక, మున్సిపల్ శాఖలు నియమ నిబంధనలు విధించడం పరిపాటే.. అయితే ఈ నిబంధనల అమలు విషయంలో చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారనే విమర్శలున్నాయి. జాతరలు, ఇతర ఉత్సవాలు ప్రజలకు ఇబ్బంది కలిగించకుండా నిర్వహించాలని చెబుతున్నా.. పెద్దశబ్దాలతో టపాకాయలు పేల్చడం, ఊరేగింపుల పేరిట వీధుల్లో పాద చారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. మహిళలు, చిన్నపిల్లలు, వృద్ధులు ఉత్సవాల సందర్భలో వీధుల్లో తిరగాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే పందిళ్ల వద్ద యువత కొన్ని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడడంపై పోలీసు యంత్రాగం పూర్తి స్థాయిలో కట్టడి చేయలేకపోతోంది. రోడ్లపై విగ్రహాలు ఏర్పాటు చేయడంతో వాహనదారులు పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు.

నిమజ్జనాల సందర్భంగా ప్రమాదాల వల్ల యువత గాయాలు, ప్రాణాలు పోవడం వంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ఏడాది వినాయక చవితి 27వ తేది ఉత్సవాలు పెద్ద ఎత్తున జిల్లా వ్యాప్తంగా జరగనున్నాయి. వీధివీధినా విగ్రహాలు ఏర్పాటు చేయనున్నారు. పోలీసు ఆంక్షలు, నిబంధనలు కఠినంగా అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పోలీసు నిబంధనలు

వినాయక చవితి పండుగ సందర్భంగా వినాయక మంటపం ఏర్పాటు చేసే ప్రజల కోసం ప్రత్యేకంగా ఒక సింగిల్ విండో క్లియరెన్స్ విధానం తీసుకుని వచ్చింది. ఇంతకు ముందు వినాయక మంటపం ఏర్పాటు కోసం ప్రజలు అగ్నిమాపక శాఖ, పురపాలక శాఖ, విద్యుత్ శాఖ, పోలీసు శాఖల నుంచి నిరభ్యంతర పత్రం తీసుకోవాల్సి ఉండేది. వెసులుబాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ సింగిల్ విండో క్లియరెన్స్ విధానం రూపొందించింది. వెబ్‌సైట్‌లో గణేష్ మంటపం ఏర్పాటు చేయాలనుకున్న కమిటీ సభ్యుల వివరాలతో పాటు మరికొన్ని వివరాలను నమోదు చేసి పొందవచ్చు. వినాయక విగ్రహ ప్రతిష్ఠ, పందిళ్లు, మండపాలు ఏర్పాటు చేసుకోవడానికి 5 లేదా అంతకంటే ఎక్కువ మంది కమిటీగా ఏర్పడి వారి వివరాలు సంబంధిత పోలీసు స్టేషన్‌లో తెలపాలని, గుర్తింపు కార్డు నకలు కాపీలు పోలీసు వారికి చూపించి అనుమతులు తీసుకోవాలన్నారు.

ప్రతిష్ఠించనున్న వినాయక విగ్రహాల ఎత్తు, బరువు, ఉత్సవం నిర్వహించే రోజుల సంఖ్య, నిమజ్జనం చేసే తేదీ, సమయం, నిమజ్జన మార్గం, నిమజ్జన ప్రదేశము, విగ్రహ నిమజ్జనానికి ఉపయోగించే వాహన వివరాలను, తప్పని సరిగా పోలీస్ స్టేషన్‌కు తెలపాలి. ప్రైవేట్ లేదా పంచాయతీ మున్సిపాలిటీకి సంబంధించిన స్థలాలలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసే వారు ముందు సదరు ప్రవేటు స్థలమైతే స్థల యజమాని అనుమతి, ప్రభుత్వ స్థలమైతే పంచాయతీ, మున్సిపాలిటీ వారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. విద్యుత్, అగ్నిమాపక అనుమతులు తప్పని సరిగా పాటించాలి. పెద్ద పెద్ద సౌండ్లతో లౌడ్ స్పీకర్లు పెట్టరాదు. ఊరేగింపు సమయాలలో ఎక్కడ కులాలు, మతాలకు, పార్టీలకు అనుగుణంగా కాని వ్యతిరేకంగా రెచ్చగొట్టే విధంగా నినాదాలు చేయకూడదు. వినాయక విగ్రహం దగ్గర కానీ, విగ్రహ నిమజ్జన ఊరేగింపు సమయంలో, ఇష్టం లేని వారిపై, తెలియని వ్యక్తులపై రంగులు చల్లడం, కోడి గుడ్లు, టమాటాలు వేయడం, డీజేలు, అసభ్యకర నృత్యాలు చేయరాదన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా, ఉత్సవ కమిటీ కార్యనిర్వాహకులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, గొడవలు చోటు చేసుకున్నా వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు, లేదా 112 నెంబర్ కు తెలియ జేయాలి. ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని భావిస్తూ నిర్వహించే ఉత్సవాలు ప్రజలకు ఇబ్బంది కలిగించకుండా నిర్వహించాల్సి వుంది.

చెరువులను తలపిస్తున్న పంటపొలాలు


నీట మునిగిన పొలాలు

ప్రజాశక్తి -పలమనేరు రూరల్ (గంగవరం): గంగవరం, పలమనేరు రూరల్ పరిసర ప్రాంతాలలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పంట పొలాలు నీట మునిగి చెరువులు తలపిస్తున్నాయి. ఈ ఏడు సకాలంలో వర్షాలు రావడంతో రైతులు ఎక్కువగా వరి పంటలు పండించడానికి ఆసక్తి చూపి ఈనెల ఒకటో తేదీ నుండి వరి పైర్లు నాటారు. అయితే వర్షానికి పూర్తిగా వరి పంటలు మునిగి పోవడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. వీటితో పాటు కూరగాయల పంటలు, పూల తోటలలో నీరు నిండి పోవడంతో ఎక్కువ తేమతో నిండి మొక్కలు చనిపోతాయని రైతులు పేర్కొంటున్నారు. గతంలో వర్షాలు లేక వేరుశనగ పంటకు దూరంగా ఉన్న రైతులు ఎంతో ఆశతో వరి, కూరగాయల పంటలపై ఆసక్తితో వున్న సమయంలో పరిస్థితి ఇలా కావడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతాల్లోని చెరువులు, మరవల పోవడానికి సిద్ధంగా ఉన్నాయి.

నీట మునిగిన వరి



నక్కల కాలనీలో కార్డెన్ సెర్చ్


కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి -వెదురుకుప్పం: ఎస్పి మణికంఠ చందోలు ఆదేశాల మేరకు నగరి డిఎస్పి మహమ్మద్ అజీజ్, సూచనలతో కార్వేటి నగరం సిఐ హనుమంతప్ప సార ధ్యంలో వెదురు కుప్పం ఎస్ఐ వెంకట సుబ్బయ్య, సిబ్బందితో నక్కల కాలనీలో శనివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారి నుండి సుమారు 12 మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకొని, వాహన రికార్డులు తనిఖీ చేశారు. నక్కల కాలనీ గ్రామ వాసులకు తగు సూచనలు ఇచ్చారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

బంగారుపాళ్యం: కొత్త వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని సీఐ శ్రీనివాసులు హెచ్చరించారు. శనివారం మండలంలోని టేకు మంద గ్రామంలో కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామానికి కొత్త వ్యక్తులు వచ్చినప్పుడు వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని, దుకాణాల్లో అక్రమ మద్యం, మనిషికి హాని చేసే క్రిమి సంహారక మందులు విక్రయించరాదన్నారు. వాహనాలు కొనుగోలు చేపట్టేటప్పుడు వాహనానికి సంబంధించిన పూర్తి సమాచారంతో కొనుగోలు చేయాలని గ్రామంలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించ కూడదన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ బాబు, కిరణ్ పలువురు పోలీసులు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం జేమ్స్ యెన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్రలో భాగంగా శనివారం అరుణ్ డెంటల్ కేర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలోని సుమారు 300 మంది విద్యార్థులకు ఉచితంగా దంత వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు మందులను అందజేసినట్లు ఆస్పత్రి అధినేత డాక్టర్ అరుణ్ కుమార్ తెలిపారు. విద్యార్థులకు దంత సంరక్షణపై అవగాహన కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం కళాశాల విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగన్నాథ రావు, డాక్టర్ శివ సాయి, శ్రీనివాసులు, రాధాకృష్ణ, మల్లప్ప రాజు, ప్రవీణ్ కుమార్, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

వీఆర్ఏల అటాచ్‌ను తొలగించాలి

డీటీకి రేషన్ షాపు డీలర్ల వినతి



ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: కొంత మందికి డీలర్లకు వీఆర్ఏ అటాచ్ మెంట్ చేయడాన్ని తొలగించాలని ఉప తహాశీల్దార్ మహేష్‌కు రేషన్ షాపు డీలర్లు విన్నవించారు. గంగాధర నెల్లూరులో చౌక దుకాణాల డీలర్లు శనివారం స్థానిక రెవెన్యూ కార్యా లయంలో ఉప తహాశీల్దారు మహేష్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్లు పలువురు మాట్లాడుతూ మండలం లో చాలామందికి బియ్యం 500 కిలోల నుండి 1000 కేజీల వరకు తూకాల్లో తక్కువతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పౌరసరఫరాల శాఖ గోడౌన్ లో ముందు తూకం వేసేటప్పుడు ఒకలాగా చౌక దుకాణం వద్ద అన్‌లోడింగ్ చేసి కార్డు దారులకు వేశాక తూకం తక్కువగా ఎలా వస్తుందని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో గోడౌన్ డీటి కరుణాకర్ రెడ్డి, ఆర్ఐ ఏకాంబరం, మండల రేషన్ షాపు డీలర్లు సంఘం అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, పలువురు డీలర్లు పాల్గొన్నారు.

పొడి విత్తనాలు విత్తే పద్ధతిని పాటించండి

ప్రజాశక్తి -విజయపురం (నగరి) : వర్షాకాలం ముందే పొడి విత్తనాలు విత్తే పద్ధతిని రైతులు పాటిస్తే మంచి ఫలితాలు చూడవచ్చని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎ.వాసు రైతులకు సూచించారు. శనివారం గుండ్రజకుప్పం, రామాపురం, రాజులకండ్రిగ, గ్రామాలలో వర్షాకాలం ముందే పొడి విత్తనాలు విత్తే పద్ధతి (పీఎండీఎస్) పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణంగా రైతులు వర్షం పడి భూమి పదులు అయిన తర్వాత దున్ని విత్తం వేస్తారన్నారు. అయితే పీఎండీఎస్ పద్ధతిలో రైతులు వర్షం రాకమునుపే, ఎండలు ఉన్నపుడే నేల పొడిగా ఉన్నపుడే విత్తనాలు విత్తుతారన్నారు. అనంతరం వరి సాగులో ప్రత్యామ్నాయ తడి, ఎండబెట్టే పద్ధతితో సమర్థవంతమైన వరి సాగు అనే విధానాల గురించి రైతులకు వివరించారు. వాటికి సంబందిత పైపులను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఆర్ గురు ప్రసాద్, ఎన్ఎఫ్ఏ నాంచారమ్మ, చంద్రశేఖర్, సురేష్, పుండరీకం, అమల, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి వితరణ

ప్రజాశక్తి -యాదమరి: పెడకంటి గ్రామస్తులైన రూప, ప్రేమ్ దంప తులు సుమారు5వేల రూపాయలు గల విద్యా సామగ్రిని(రైటింగ్ ప్యాట్స్,పెన్నులు,పెన్సిల్స్, ఇంగ్లీషు కాపీ రైటింగ్ పుస్తకాలు పెరుమాళ్ళపెంట మోడల్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు అందించినట్లు హెచ్‌యం సి రమేష్ తెలిపారు. సుమారు 35 మందికి ఈ సామగ్రి అందించారు. ఈ కార్యక్రమం లో రఘునాథ రెడ్డి స్వీట్లు అందించారు. రూప,ప్రేమ్ దంపతులను హెచ్‌యం. రమేష్, ఉపాధ్యాయులు ప్రశంసించారు. ఈకార్యక్రమంలో టీచర్స్ మోహన్ కుమార్, నాగరాజశెట్టి, మూర్తి, విద్యా కమిటీ సభ్యులు, అంగన్‌వాడీ సిబ్బంది ధనలక్ష్మి, నీరజ, మలేశ్వరి, వసంత విద్యార్థులు పాల్గొన్నారు.

అక్షరాంధ్ర వాలంటీర్లకు శిక్షణ

ప్రజాశక్తి -కార్వేటినగరం : మండల పరిధిలోని వెలుగు కార్యా లయంలో శనివారం వాలంటీర్లకు శిక్షణ నిర్వహించారు. ఏపీ కవిత మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమానికి 1850 గుర్తించి 185 మంది వాలంటీర్ల ద్వారా మండలంలో చదువురాని మహిళలకు 100 రోజులు చదువు నేర్పించి పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. 185 మంది వాలంటీర్లకు 90 మంది వాలంటీర్లకు అడల్ట్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్, వెలుగు డిపార్ట్మెంట్, ఎన్ఆర్ ఈజీఎస్ సంయుక్తంగా శిక్షణ ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం కిరణ్, సిసిలు ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లికి హంద్రీ- నీవా నీరు

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా విడుదల చేసిన గోదావరి నీరు శనివారం బైరెడ్డిపల్లి మండలంలోని తీర్థం గ్రామం సమీపంలోని ప్రధాన కాలువలో ప్రవేశించింది. ఈ నీరు తాగునీరు, సాగునీరు అవసరాల నిమిత్తం కుప్పం పరిసర ప్రాంతాలకు చేరేలా కూటమి ప్రభుత్వం ఇటీవల కాలువల మరమ్మతులు చేపట్టిన విషయం తెలిసిందే. దాంతో కాలువల ద్వారా ప్రవహిస్తున్న నీటిని చూసి రైతులు ఆనందోత్సాహాలతో ఉప్పొంగిపోతున్నారు. నీరు అందు బాటులోకి రావడంతో మండల ప్రజలలో సరికొత్త ఆశలు పుట్టుకొచ్చాయి. ప్రభుత్వం ఈ జలాలను మండలంలోని వివిధ చెరువులకు మళ్లిస్తే, విస్తారమైన భూములు పచ్చదనంతో కళకళలాడే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. పంటల సాగుకు తగినంత నీరు అందితే ఈ ప్రాంతం మళ్లీ సస్యశ్యామలంగా మారుతుందని వారు విశ్వసిస్తున్నారు. అదే సమయంలో, కైగల్ ప్రాజెక్టు పూర్తి చేస్తే కర్ణాటక రాష్ట్రం వైపు వృథాగా వెళ్తున్న నీటిని కూడా చెరువులకు మళ్లించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఈ ప్రాజెక్టుకు టెండర్లు పిలిచి నిధులు కేటాయించినప్పటికీ, ఎన్నికల కారణంగా పనులు ఆగిపోయాయి. ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం ఈ ప్రాజెక్టుపై దృష్టి సారించి పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ముందుకు వచ్చి చర్యలు తీసుకుంటే బైరెడ్డిపల్లి మండలం నీటి కొరతలేని ప్రాంతంగా మారడం ఖాయం అని రైతులు నమ్ముతున్నారు. "కైగల్ ప్రాజెక్టు పూర్తయితే భూములన్నీ పచ్చదనంతో ముసురుకుంటాయి. పంటలు పండుతాయి. మా జీవనోపాధి స్థిరపడుతుంది' అని మండల రైతులు అంటున్నారు.



కుప్పంలో రోడ్డు విస్తరణకు గ్రీన్ సిగ్నల్


మాట్లాడుతున్న టిడిపి నాయకులు రాజకుమార్

ప్రజాశక్తి-కుప్పం : కుప్పం పట్టణం కొత్తపేటలో రోడ్డు విస్తరణకు స్థానికులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. రోడ్డు విస్తరణకు సంబంధించి ఇదివరకే పలుమార్లు అధికారులు, టిడిపి శ్రేణులు కొత్తపేట వాసులతో సమావేశాలు నిర్వహించారు. శనివారం టిడిపి మున్సిపల్ పార్టీ అధ్యక్షులు రాజకుమార్ రోడ్డు విస్తరణ బాధితులతో సమావేశం నిర్వహించారు. కొత్తపేటలో 40 అడుగుల మేరకు రోడ్డు విస్తరణ చేపట్టేందుకు సహకరించాలని టిడిపి నేతల విజ్ఞప్తి నేపథ్యంలో కొత్తపేట వాసులు సైతం 40అడుగుల రోడ్డు విస్తరణకు సుముఖత వ్యక్తం చేశారు. రోడ్డు విస్తరణ కారణంగా ఇల్లు దుకాణాలు కోల్పోయే వారికి పూర్తి స్థాయిలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. రోడ్డు విస్తరణకు కొత్తపేట వాసులు మద్దతు ఇవ్వడంతో త్వరలోనే విస్తరణ పనులు మొదలుకానుంది. ఇప్పటికే కొత్తపేటలో పాత పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్‌ను పడగొట్టి ఆర్డిఓ, డిఎస్‌పి, ఎక్సైజ్ కార్యాలయాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి కన్నన్, కొత్తపేట ఇన్‌ఛార్జి అప్పు, కో క్లస్టర్ తిరుమగల్, టిఎన్ఎస్ఎఫ్ మునెప్ప, నాయకులు అమర్, కృష్ణ, హరినాథ్ గౌడ్, సుకుమార్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా వినాయక చవితి నిర్వహించాలి

ప్రజాశక్తి -విజయపురం (నగరి) : ప్రశాంతంగా వినాయక చవితి నిర్వహించుకుందాం.. అని ఆర్‌డీవో అనుపమ అన్నారు. రానున్న వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై చర్చించడానికి శనివారం పట్టణ పరిధిలోని మెప్మా కార్యాలయంలో రెవెన్యూ, పోలీసులు, విద్యుత్‌శాఖ, అగ్నిమాపక శాఖ అధికారులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలు ఎవరికీ ఇబ్బందులు కలుగకుండా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్, డివిజన్ పరిధిలోని తహాశీల్దార్లు, సీఐలు, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోలు, విద్యుత్ శాఖ ఏడీ, ఏఈలు, అగ్నిమాపక అధికారులు పాల్గొన్నారు.

బంగారుపాలెం: వినాయక ఉత్సవంలో జాగ్రత్తలు పాటించాలని సిఐ శ్రీనివాసులు అన్నారు శనివారం పోలీస్ స్టేషన్లో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక ఉత్సవంలో సమాచారం ఇవ్వాలని ఎలాంటి ఘర్షణలకు తావివ్వక ప్రశాంత వాతావరణంలో పండగ నిర్వహించుకోవాలని, నిమజ్జనం రోజు నిబంధనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ మల్లప్ప హెడ్ కానిస్టేబుల్ బాబు పాల్గొన్నారు.

పుంగనూరు: పుంగనూరు అర్బన్, రూరల్ పరిధిలో గణేష్ విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు పోలీసు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని అర్బన్ సిఐ సుబ్బరాయుడు అన్నారు. స్థానిక జేయండీ కళ్యాణ మండపం లో గణేష్ ఉత్సవాల నిర్వహణ కమిటీ సభ్యుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఉత్సవాల నిర్వహణ, మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి అన్నారు. ఎటువంటి అల్లర్లు, ఘర్షణలకు తావులేకుండా నిర్వహించు కోవడానికి పోలీసుశాఖకు ప్రజలందరూ సహకరించాలని కోరారు.

జిల్లా మహాసభను జయప్రదం చేయండి

జిల్లా పారిశుధ్య కార్మికుల అధ్యక్షులు మధు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: పారిశుధ్య కార్మికుల 10వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పారిశుధ్య కార్మికుల జిల్లా అధ్యక్షులు మధు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల పదవ జిల్లా మహాసభలు ఆదివారం జిల్లాలోని వి కోట మండలంలో పేర్నం బట్టు రోడ్‌లోని వీఎస్ ఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించ నున్నట్లు ఈ మహాసభలకు రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు పాల్గొంటారని జిల్లాలోని పారిశుధ్య కార్మికులు, స్వచ్ఛభారత్ కార్మికులు పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు.

హంద్రీ-నీవా వాల్వ్ లీకేజ్

ప్రజాశక్తి -వికోట : మండల పరిధి లోకి శనివారం కృష్ణా జలాలు ప్రవేశించాయి. మొట్లపల్లి పంప్ హౌస్ వద్ద అధికారులు , అఖిలపక్ష నేతలు లాంఛనంగా మోటర్లను ఆన్ చేసి పంపింగ్ ప్రారంభించారు. అయితే మండలంలోని ముదిమడుగు చెరువు మీదుగా వెళుతున్న కాలువ నీటి వాల్వులో నీరు లీకై పైకి నీరు వెదజల్లడంతో నీరు మొత్తం ముదిమడుగు చెరువు చేరుకుంది.ఈ వాల్వ్ ద్వారా గ్రావిటీపై నీరు దాసర్ల పల్లె రోడ్డు దాటి కుప్పం వైపు పయనించాల్సి ఉంది. అయితే వాల్వ్ పగిలిపోవడంతో నీరు మొత్తం లీకై ముదిమడుగు చెరువులో ప్రవహిస్తోంది. సంబంధిత అధికారులు సత్వరం మరమ్మతులు చేపట్టి అనుకున్న సమయానికి కుప్పానికి నీరు అందిస్తారన్న ఆశాభావాన్ని మండల ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

చంద్రబాబు కృషితోనే 'కుప్పం' కు కృష్ణా జలాలు

- కుప్పం సస్యశ్యామలం
- ప్రతి పంప్ సెట్‌కూ సోలార్ విద్యుత్
- రానున్న ఎడాదిన్నరలో 15వేల ఉద్యోగాలు
- ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కడ పీడీ వికాస్ మర్మత్

ప్రజాశక్తి- కుప్పం: రాయలసీమలో అత్యంత వెనుకబడిన కుప్పం ప్రాంతం సస్యశ్యామలం చేసేందుకు కృష్ణా జలాలను కుప్పంకు తీసుకువచ్చేందుకు సీఎం చంద్రబాబు అవిరళ కృషి చేశారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. హంద్రీ-నీవా కాలువ ద్వారా కృష్ణా జలాలు ఈనెల 29 నాటికి కుప్పం మండలం పరమసముద్రం వద్దకు చేరుకుంటుందని 30వ తేదీ సీఎం చంద్రబాబు దంపతులు హంద్రీ-నీవాకు జల హారతి ఇచ్చి కుప్పంకు విడుదల చేయనున్నట్లు ఎమ్మెల్సీ తెలిపారు. హంద్రీ-నీవాతో కుప్పం ప్రాంతం సస్యశ్యామలం అవుతుందన్నారు. 1200 అడుగుల ఎత్తులో ఉన్న కుప్పం ప్రాంతానికి కృష్ణా జలాలను తీసుకొచ్చేందుకు సీఎం చంద్రబాబు ఎంతగానో కృషి చేశారని 2014 నుండి 19 వరకు హంద్రీ-నీవా పనులు జరిగిన ఆ తర్వాత వైసిపి ప్రభుత్వం ఐదేళ్ల కాలయాపన చేసిందన్నారు. కుప్పం ప్రాంతంలో ప్రస్తుతం 1500 అడుగులు వేసిన బోర్లలో నీళ్ల పడే పరిస్థితి లేదని అయితే హంద్రీ-నీవా నీళ్లను కుప్పం నియోజకవర్గ పరిధిలోని చెరువులకు మళ్లించి ఇక్కడి సాగు, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతున్నారన్నారు.

11 పరిశ్రమల ద్వారా 4 వేల కోట్ల పెట్టుబడులు

కుప్పం నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు ఇప్పటికే 8 పరిశ్రమలతో ఎంఓయు కుదుర్చు కున్నామని త్వరలోనే మరో మూడు పరిశ్రమలతో ఎం ఓ యు కుదుర్చుకోనున్నట్లు కడ పీడీ వికాస్ మర్మత్ తెలిపారు. వచ్చే రెండేళ్లలోపు 15వేల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఐటిసి వారు రాష్ట్రంలో 30 మున్సిపాలిటీల్లో ప్రజలకు చెత్త సేకరణ, విద్యుత్, నీటి వినియోగం, ప్లాస్టిక్ రహితం



సమాజం కోసం అవగాహన కల్పిస్తుండగా కుప్పం నియోజకవర్గ పరిధిలోని 93 పంచాయతీల్లో డోర్ టు డోర్ చెత్త సేకరణ చేపడుతామన్నారు. ఇప్పటికే నియోజక వర్గంలో 8 వేల ఇళ్లకు మరో మూడు నెలల్లో సోలార్ విద్యుత్ ఇస్తామని తెలిపారు. తక్కిన 42 వేల ఇళ్లకు వచ్చే సంవత్సరం డిసెంబర్ లోపు పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి పంప్ సెట్ కు సోలార్ ద్వారా విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పీడీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం, పి కేయం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, మున్సిపల్ పార్టీ అధ్యక్షులు రాజ్ కమార్, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, కడ అడ్వైజర్ కమిటీ సభ్యులు సుగుణమ్మ, వెంకటేష్ పాల్గొన్నారు.

బార్, రెస్టారెంట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి -విజయపురం (నగరి) : నగరి మున్సిపల్ పరిధిలో డీపీఈవో చిత్తూరు ఆదేశాల మేరకు ఏర్పాటు చేయనున్న బార్ అండర్ రెస్టారెంట్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దానికి సంబంధించి విధివిధానాలను ఆయన తెలిపారు. నగరి మునిసిపాల్టీలో ఒక బార్ అండ్ రెస్టారెంట్‌కు అనుమతి ఉన్నందున దానికి టెండర్లను ఆహ్వానిస్తున్నామన్నారు. ఆన్‌లైన్, ఆఫ్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్, చిత్తూరు వారు స్వీకరిస్తారన్నారు. దరఖాస్తుదారుడు నాన్ రిఫండబల్ అప్లికేషన్ ఫీజు రూ. 5 లక్షలు, ప్రాసెస్ ఫీజు రూ. 10 వేలు చెల్లించాలన్నారు. లైసెన్స్ పొందేవారు మొదటి సంవత్సరం లైసెన్స్ ఫీజు రూ. 55 లక్షలు చెల్లించాలన్నారు. ఏవైనా సందేహాలుంటే నగరి ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో సంప్రదించాలని, లేదా 9440902548 నెంబరు ద్వారా తెలుసుకోవచ్చన్నారు

యూరియా కొరతకు పరిష్కారం



ప్రజాశక్తి -సోమల: మండలంలోని రైతులకు యూరియా కొరత లేకుండా స్టాక్ ఎప్పటికప్పుడు తెప్పిస్తూ రైతులకు అందిస్తున్నామని వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ తెలిపారు. శనివారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ మండలంలో ప్రస్తుతం ఇరికిపెంట, నెల్లి మంద, కందూరు రైతు సేవ కేంద్రాలలో ఒక్కో రైతు సేవా కేంద్రంలో 150 బ్యాగుల చొప్పున యూరియా నిల్వ ఉంచామని టోకెన్ విధానంలో రైతు సాగు చేసిన విస్తీర్ణానికి అవసరమైన యూరియా మేర అందిస్తున్నా మన్నారు. ఒక్కో మూట ధర 266-50 రూపాయల చొప్పున అందజేస్తున్నామని తెలిపారు. మండలంలోని ఏ రైతు అయినా వారికి సమీపంలోని రైతు సేవా కేంద్రంలో, ప్రైవేటు ఏజెన్సీల వద్ద, యూరియా స్టాక్ వుంటే వచ్చి పట్టాదారు పాసుపుస్తకం, సాగుచేసిన పంట విస్తీర్ణం తెలిపే జిరాక్స్ కాపీలను అందించాలని కోరారు. పెద్ద ఉప్పర పల్లి పొదల కుంటపల్లి సోమల1 రైతు సేవా కేంద్రా లకూ యూరియా తెప్పించేందుకు ఆర్డర్ పెట్టామని వచ్చిన వెంటనే రైతులకు అందిస్తామని తెలిపారు. రైతులు నానో యూరియా వాడడం వల్ల కలిగే ఉపయోగాలను కూడా తెలుపుతున్నామని అధికారుల సూచనలు, సలహాలు పాటించి రైతులు వ్యవసాయ పొలాలకు ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడితే అధిక దిగుబడులు, నాణ్యమైన పంట వస్తుందని తెలిపారు.

కుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలన : తహాశీల్దారు

ప్రజాశక్తి-సోమల: సోమల మండలంలోని అన్ని రెవెన్యూ పరిధిలోని గ్రామాలలో మొత్తం 6,916 మంది కుల ధ్రువీకరణ పత్రాల వెరిఫికేషన్ జాబితా వచ్చిందని తహాశీల్దారు మధుసూదన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ సుమోటాగా ప్రభుత్వం ఓసి, బీసీ, ఎస్‌సి, ఎస్టీ మైనారిటీ అన్ని కులాలకు చెందిన వారి కుల ధ్రువీకరణ పత్రాలు వెరిఫికేషన్ చేసి రెండు రోజుల్లో నివేదికలు అందించాలని కోరారని వీఆర్‌వోలు ఫీల్డ్ పరిశీలనకు వచ్చినప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలు, అందుకు సంబంధిం చిన టిసి, ఇతర పత్రాలు, ఆధార్ కార్డు, జిరాక్స్ అందించాలని ఎవరి పేరు అయితే కుల ధ్రువీకరణ పత్రం వెరిఫికేషన్‌కు వచ్చిందో వారు మాత్రమే అందిస్తే సరిపోతుందని తెలిపారు. అన్నదాత సుఖీభవ సాయం మండలంలో 704 మంది రైతులకు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. తల్లిదండ్రులు మృతి చెంది ఆస్తి వారి పేరుపై ఉన్నవారు అన్నదమ్ములు భాగ పరిష్కారం చేసుకోకపోవడం, రిజిస్ట్రేషన్ లేకపోవడం, పౌర హక్కుల ద్వారా వారసులు, మ్యుటేషన్ చేయించుకోకపోవడం తదితర కారణాలతో వారికి అన్నదాత సుఖీభవ ఆర్థిక సాయం డబ్బు అకౌంట్లో పడలేదని తెలిపారు. ఇందుకోసం ఆధార్ సీడింగ్ సరిగా చేయించుకోవడానికి వీఆర్‌వోలతో సంప్రదించి సమస్య పరిష్కరించుకున్నప్పుడే రెండవ విడత అన్నదాత సుఖీభవ ఆర్థిక సాయం సంబంధిత రైతులకు అకౌంట్లో జమ అయ్యే అవకాశం వుందని తహాశీల్దారు మధుసూదన్, వ్యవసాయ అధికారి సుధాకర్ తెలిపారు.

క్రైం న్యూస్

విశ్రాంత తహాశీల్దారుపై దాడి

ప్రజాశక్తి -పుంగనూరు: బస్సులో సెల్ ఫోను ద్వారా పెద్ద శబ్దంతో విసిగిస్తున్న ఓ వ్యక్తిని వారించినందుకు విశ్రాంత తహాశీల్దారుపై కొందరు దాడికి పాల్పడ్డ సంఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. కడప విశ్రాంత తహాశీల్దారు అంజాద్ హుస్సేన్ మదనపల్లి నుండి పుంగనూరు తహాశీల్దారు రాముని కలవడానికి బస్సులో బయలు దేరాడు. పక్క సీట్లో కూర్చొన్న వ్యక్తి షేర్ ఖాన్ సెల్ ఫోన్ లో పెద్ద శబ్దం చేసి విసిగిస్తుండడంతో వారించాడు. దీంతో ఆ వ్యక్తి " నాకు చెప్పడానికి నువ్వెరు?' అని ఆవేశంతో ఘర్షణకు దిగాడు. తర్వాత ఆ విశ్రాంత తహాశీల్దారు బస్సు దిగి పుంగనూరు తహాశీల్దారు కార్యాలయంలోకి ప్రవేశిస్తున్న సమయంలో షేర్ ఖాన్ తన మిత్రులు కరీం, సాదిక్‌లను రప్పించుకుని తహాశీల్దారు కార్యాలయంలోకి ప్రవేశించి అంజాద్ హుస్సేన్‌పై దాడికి పాల్పడి గాయపరిచాడు. విశ్రాంత తహాశీల్దారు ఫిర్యాదు మేరకు సీఐ సుబ్బరాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

షాపును ఢీకొన్న ద్విచక్రవాహనం

వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: అతి వేగంతో ద్విచక్ర వాహనం షాపు ఢీకొనడంతో అందులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. వేల్కూరు సమీపంలో ఓ గ్రానైట్ ఫ్యాక్టరీలో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన అశోక్ కుమార్ (28) పనిచేస్తున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి అగర మంగళం నుండి వేల్కూరుకు ద్విచక్ర వాహనంపై కృష్ణకుమార్‌తో కలిసి అతివేగంగా వెళుతూ గంగాధరనెల్లూరులోని ఓ షాపుపైకి దూసుకెళ్లాడు. దీంతో వాహనాన్ని నడుపుతున్న అశోక్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందగా, వెనక ఉన్న కృష్ణకుమార్‌కు ఎలాంటి గాయాలు లేకుండా బయటపడ్డారు. అశోక్ కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనాలు ఢీ

వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-పలమనేరు: ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలైన సంఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు..పలమనేరు సమీపం నాగమంగళంకు చెందిన నజీమ్ అనే యువకుడు ద్విచక్ర వాహనంలో తన ఇంటికి వెళ్తుండగా రాంగ్ రూట్లో ద్విచక్ర వాహనంలో వచ్చిన మరో యువకుడిని వేగంగా ఢీకొని వెళ్లిపోయాడని, దీంతో నదీమ్ రెండు కాళ్లకు తీవ్ర గాయాలు కాగా గమనించి 108 వాహనానికి సమాచారం అందించి వైద్యం నిమిత్తం పలమనేరు ఏరియా ఆసుపత్రికి తరలించారన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందిందని తెలిపారు.

బావిలో పడి కర్ణాటక వ్యక్తి మృతి

బైరెడ్డిపల్లిలో విషాదం

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: బావిలో కర్ణాటక వ్యక్తి పడి మృతి చెందిన సంఘటన బైరెడ్డిపల్లి మండలంలోని బేలుపల్లి పంచాయతీ పరిధిలో చోటు చేసుకుంది. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం వ్యవసాయ బావిలో కనిపించడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న ఎస్ఐ పరశురాముడు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. దర్యాప్తులో మృతుడు కర్ణాటక రాష్ట్రం, దొడ్డగుట్టహళ్లి గ్రామానికి చెందిన ఆశ్వత (45) అని గుర్తించారు. కుటుంబ సభ్యుల కథనం మేరకు..ఆశ్వతకు ఇద్దరు భార్యలు వున్నారు. సుశీలమ్మ, నిర్మలమ్మ భార్యలు కాగా వీరికి నలుగురు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా మానసిక సమస్యలతో బాధపడుతున్న ఆయన బైరెడ్డిపల్లి మండలంలోని పిచ్చి గుండ్లపల్లి గ్రామంలో బంధువుల ఇంటికి వచ్చి అక్కడే వుంటున్నాడు. అదే సమయంలో బేలుపల్లి పంచాయతీ పరిధి లోని వ్యవసాయ బావిలో పడిపోవడంతో దురదృష్టవశాత్తు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

టెంపో ఢీ కొని ఆవు, దూడ మృతి

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మినీ టెంపో ఢీ కొనడంతో ఆవు, దూడ మృతి చెందిన సంఘటన శనివారం మండలంలోని బసవరాజుకండ్రిగ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు గ్రామంలోని శేఖర్ కు చెందిన ఆవు, దూడలు రహదారి పక్కన గడ్డి మేస్తుండగా తమిళనాడు నుండి కోళ్లను తరలించే మినీ టెంపో పుంగనూరు వైపు వస్తూ ఢీ కొన్నట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో ఆవు,దూడ అక్కడికక్కడే మృతి చెందాయి.సుమారు 1.50 లక్షలు నష్టపోయినట్లు బాధిత పాడిరైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై పోలీసులకు పిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

పారిపోయిన యువతి తల్లిదండ్రులకు అప్పగింత

ప్రజాశక్తి - యాదమరి: ఇంటి నుండి బిడ్డతో పారిపోయిన ఓ యువతిని పోలీసులు కనుగొని వారి తల్లిదండ్రులకు అప్పగిం చారు. యాదమరి మండలం రసూల్ నగర్ కు చెందిన నగీన (25) తన మూడు సంవత్సరాల బాబుని తీసుకొని వారి కుటుంబ సమస్యల కారణంగా ఇంటి నుండి శనివారం మధ్యాహ్నం రెండున్నర గంటలకు వెళ్లిపోయింది. నగిన తండ్రి జబీర్ ఈ మేరకు యాదమరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన కూతురు ఎక్కడ రైల్వే ట్రాక్ ఫొటోలు పెడుతూ రైల్వే ట్రాక్‌లో పడి చనిపోతానని బెదిరిస్తోందని తెలిపారు. అప్రమత్తమైన యాదమరి పోలీసులకు ఆమె మొబైల్ నెంబర్ పనిచేస్తున్నందున సాంకేతికంగా ఆమెను తిరుపతి పట్టణం రైల్వే స్టేషన్ ట్రాక్‌లో వుందని కనుగొన్నారు. ఆమెకు భయపడకుండా ఫోను ద్వారా మనోధైర్యం ఇచ్చి ఆమెతో మాట్లాడుతూ అక్కడి రైల్వే పోలీసుల సహకారంతో ఆమెను ఆత్మహత్య చేసుకోకుండా కాపాడి వారి తల్లిదండ్రులకు అప్పగించారు.

ఎస్పి అభినందనలు

కేవలం ఒక గంట వ్యవధిలో సాంకేతికంగా ఆమె ఆచూకీ కనుగొని ఆమెతో మాట్లాడి కుటుంబ సభ్యులకు అప్పజెప్పిన యాదమరి పోలీసులను ఎస్పి విఎన్ మణికంఠ చందోలు అభినందించారు. తమ కూతురిని, 3 సంవత్సరాల మనవడిని తమకు అప్పజెప్పినందుకు ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

పీఈఎస్ లో స్ఫూర్తి వచనాలు



ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: పీఈఎస్ పబ్లిక్ పాఠశాలలో శనివారం హిమాంశు బుక్ డిపో విజయనగరం సౌజన్యంతో, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు స్ఫూర్తి దాయకమైన మాటలు అందివ్వడానికి ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, ఇంపాక్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు గంపా నాగేశ్వరావు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎదగాలంటే ముందుగా సమయపాలన చాలా అవసరమని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చెప్పిన విషయాలను శ్రద్ధగా విని ఆచరించాలని, తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలని, విద్యార్థులందరూ 7,8,9 సూత్రం తప్పక పాటించాలని, తల్లిదండ్రులు పిల్లలకు చదువుతో పాటు సంస్కారం నేర్పించాలని, పిల్లల్ని పెంచడం ఒక కళని ఇంకా చాలా ఆదర్శవంతమైన భావాలను విద్యార్థుల్లో, తల్లిదండ్రులలో ప్రేరేపించారు. కార్యక్రమంలో పీఈఎస్ పబ్లిక్ పాఠశాల డైరెక్టర్ కుమారస్వామి నాయుడు , ప్రిన్సిపాల్ వై.వి.కష్ణ బాబు , ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

కూరగాయల ధరల మోత

వినాయక చవితికి పెరిగిన నిత్యావసర ధరలు

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమలలో ప్రతి శనివారం నిర్వహించే వారపు సంతలో కూరగాయలు, నిత్యావసర సరుకులు ధరలు మోత మోగాయి. ఈనెల 27వ తేదీ వినాయక చవితి పండుగ సందర్భంగా ప్రజలు పండుగ నిర్వహణ కోసం కూరగాయలు, పూజా సామాగ్రి, నిత్యావసర సరుకులు , తమలపాకులు పండ్లు కొనుగోలు చేశారు. ఏ కూరగాయ కిలో కొనాలన్నా 60 నుండి 80 రూపాయల ధర పెట్టి వినియోగదారులు కొనాల్సి వచ్చింది. తమలపాకులు కూడా కట్ట 80 నుండి 100 రూపాయల ధర పలికాయి. అరటి, యాపిల్, దానిమ్మ ఇతర పండ్లు కూడా ధర అధికంగా ఉండడంతో పేదలు కొనుగోలు చేయడానికి వెనుకడుగు వేశారు. వినాయక చవితికి అలంకరణ కోసం పూలు కూడా అవసరం కావడంతో చామంతి చెండుమల్లి విడిపూల ధర సామాన్యుడికి అందుబాటులో లేకపోయాయి. ఏదిఏమైనా చవితి వేడుకలు నిర్వహించు కునేందుకు ప్రజలు తమ స్థాయికి తగ్గట్టుగా వారపు సంతలో సరుకులను కొనుగోలు చేశారు.


పరిశుభ్రత తోనే ఆరోగ్యం: ఎంపీడీవో

ప్రజాశక్తి -కార్వేటినగరం: కార్వేటినగరం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శనివారం ఉదయం 10 గంటలకు ఎంపీడీవో టీ చంద్రమౌళి ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర పరిసరాలను పరిశుభ్రంగా నిర్వహించారు. ఆయా పంచాయతీల్లో గ్రామ కార్యదర్శి ఆధ్వర్యంలో పరిసరాలు శుభ్రంగా ఉంటే ప్రజలు ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. ఇది ప్రతి ఒక్కరి బాధ్యతగా చేపట్టాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ పంచాయతీ కార్మికు లు, ఎంపీడీవో సిబ్బంది, చేప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో బీబీ మధుసూదన్, ఈవో జి నాగరత్నమ్మ, ఏపీవో కిరణ్, ఏపీఎం కవిత, ఎంపీడీవో సిబ్బంది పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్రను వెదురుకుప్పం డాక్టర్ వైయస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించారు. చేతులు శుభ్రత, పొడి దుస్తులు, వినియోగం, పరిసరాల పరిశుభ్రత, రుతుకాల ఆహారపు అలవాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి అన్నపూర్ణ శారద విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సి మంగళ గౌరీ, ఐక్యూఎసి కోఆర్డినేటర్ డాక్టర్ పి వెంకటేష్ , కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీప్రసన్నలత పాల్గొన్నారు .

పలమనేరు: పారిశుధ్య పరిరక్షణపై అవగాహనా ర్యాలీ పలమనేరు పురపాలక సంఘ కార్యాలయం నుండి గంగమ్మ గుడి వీధి, బజారు వీధి, జవిలి వీధి మీదుగా అంబేద్కర్ సర్కిల్ వరకు నిర్వహించారు. వార్డు పరిధిలో వార్డు సచివాలయ సిబ్బంది, కౌన్సిలర్, ప్రజా ప్రతినిధులు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఎన్‌వి రమణా రెడ్డి, మాట్లాడుతూ పరిశుభ్రతతో ప్రమాదాలు నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మేనేజర్ ఖాదర్ మొహిద్దీన్, అసిస్టెంట్ ఇంజనీర్ స్నేహ ప్రియ, టౌన్ ప్లానింగ్ సూపరువైజర్ ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

విజయపురం (నగరి) : వర్షాకాలంలో నివాస ప్రాంతాల సమీపం వర్షపు నీరు నిల్వవుండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రత పాటించాలంటూ మున్సిపల్ కార్యాలయం నుంచి ఓంశక్తి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటుచేసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డీఈఈ రవింద్రా రెడ్డి, టీపీవో జబీరాఖాతుమ్, మేనేజర్ శేఖర్, రెవెన్యూ ఆఫీసర్ తారకరామ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జయశంకర్, ఇంద్రశేఖర్, మెప్మా సీఎంఎం ప్రసాద్, పురపాలక సిబ్బంది, సచివాలయం సిబ్బంది, మెప్మా సివోలు, ఆర్పిలు పాల్గొన్నారు.



బైరెడ్డిపల్లిలో

బైరెడ్డిపల్లి: మండల పరిధిలోని తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు డాక్టర్ పద్మా వతి ఆధ్వర్యంలో తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర నిర్వహించారు, ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కాంతమ్మ, ముకుంద, ఆషా, శాంతమ్మ పాల్గొన్నారు.